క్లుప్తంగా

మంత్రిని సన్మానించిన నాయకులు



మంత్రి అడ్లూరిని సన్మానిస్తున్న నాయకులు

జమ్మికుంట: తిమ్మాపూర్ మండలం అలుగునూర్‌లో మాదిగ అఫీషియల్, ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మాదిగ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంత్రి పుల్లూరి సదానందం, అంబాలరాజు, మాజీ సర్పంచ్ అకినపల్లి సుజాత భద్రయ్య, చెరుకు సంపత్ శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



మాట్లాడుతున్న మల్లారెడ్డి

చొప్పదండి: ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారానే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని జాతీయ ఉత్తమ పీపీఎస్ అవార్డు గ్రహీత వెల్మ మల్లారెడ్డి అన్నారు. సోమవారం విద్యుత్ లైన్‌మెన్ బండారి మల్లయ్య పదవీవిరమణ సన్మాన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి మల్లయ్య చేసిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. కార్యక్రమంలో డీఈ తిరుపతి, ఏఈలు చంద్రయ్య, శంకరయ్య, కనకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత



బాధితులకు సెల్‌ఫోన్లు అందిస్తున్న సీఐ

హుజూరాబాద్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఐ కరుణాకర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం బాధితులకు అందజేశారు. సీఐ మాట్లాడుతూ హుజూరాబాద్ పీఎస్ పరిధిలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఐదుగురి ఫోన్లు స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేశామన్నారు.

పోలీసుల కౌన్సెలింగ్



కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై శేఖర్‌రెడ్డి

శంకరపట్నం: కేశవపట్నం పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం బైండోవర్, పాత నేరస్తులకు ఎస్సై శేఖర్‌రెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించొద్దని, సత్ప్రవర్తనతో ఉండాలని సూచించారు. పాతనేరస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

చెక్కులు అందజేత



గంగాధర: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజిత–శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. నాయకులు మనోహర్, కరుణాకర్, బుచ్చయ్య,కనుకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గంగయ్య, కరుణాకర్, మహేందర్, వినోద్, శ్రీని వాస్, మల్లయ్య, మోహన్‌రెడ్డి, రాజేశం పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

గంగాధర: మండల కేంద్రంలో సోమవారం ఎస్ఐ వంశీకృష్ణ, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది మాదక ద్రవ్యాలు, ఇతర నిషేధిత పదార్థాలు అక్రమంగా విక్రయిస్తున్నారేమోననే సమాచారంతో దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు.

సోషల్ మీడియా పోస్టులపై కేసు

కరీంనగర్‌క్రైం: సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టిన రంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని శేరిలింగంపల్లికి చెందిన దుర్గం శశిధర్‌గౌడ్ అలియాస్ నల్ల బాలును సోమవారం కరీంనగర్ సైబర్ పోలీసులు అరెస్టు చేసి కరీంనగర్‌కు తీసుకొచ్చారు. మధ్యాహ్నం శశిధర్‌గౌడ్‌ను అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న కరీంనగర్ బీఆర్ఎస్ నాయకులు పలువురు కమిషనరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం నల్లబాలును రిమాండ్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

జమ్మికుంట రూరల్: మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన పొల్సాని సతీశ్‌రావుకు చెందిన గొర్రె సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వెళ్తుండగా షాక్ తగిలింది.



పాడిరైతుల ఆనందం

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో పశుపాకల నిర్మాణానికి ఈజీఎస్ కింద నిధులు మంజూరయ్యాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్న 50 మంది పాడిరైతుల్లో 23 మంది నిర్మాణం పూర్తి చేశారు. కాగా పథకానికి సన్న, చిన్నకారు రైతులు మాత్రమే అర్హులు. ఒక్కో పాకకు రూ.75 నుంచి రూ. 80 వేలు మంజూరయ్యాయి. షెడ్డులో నాలుగు లేదా ఐదు పశువులు ఉండేవిధంగా వీలుగా నిర్మించారు. పూర్తయిన పశుపాకలను రైతులు ప్రస్తుతం వినియోగించుకుంటున్నారు. పశుపాకలు నిర్మించుకున్న ప్రతి రైతుకు అదనంగా కంపోస్టు పిట్, నీటితొట్టి నిర్మాణానికి రూ.12 వేలు మంజూరయ్యాయి. వీటిని పూర్తిస్థాయిలో నిర్మించుకున్నారు. ఈజీఎస్‌లో పాక నిర్మాణాన్ని 30–35 పనిదినాల్లో పూర్తి చేశారు. రూ.80 వేలల్లో రూ.పదివేలు లేబర్ చార్జీలకుపోను మిగిలిన డబ్బులు మెటీరియల్ కాంపోనెంటు కింద ఖర్చు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఐదెకరాల వ్యవసాయభూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు ఈజీఎస్ నిబంధనల ప్రకారం పశుపాకల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హులైన రైతులకు తప్పనిసరిగా మంజూరు చేస్తామని ఈజీఎస్ చిగురుమామిడి ఏపీవో, ఇన్‌చార్జి ఈసీ రవిరాజా తెలిపారు

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్: ఉపాధ్యాయులు పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దేలా ఉండాలని, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని అన్నారం ఉన్నత ప్రభుత్వ పాఠశాల చుట్టూ నిర్మించే ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. తల్లితండ్రులు, భవిష్యత్ చూపిన గురువులను ఏనాడు మరవొద్దని కృతజ్ఞతగా ఉండాలని సూచించారు. గ్రామంలోని యువకులతో వలంటరీ వ్యవస్థ ఏర్పాటు చేసి బడికిరాని పిల్లల బాధ్యత అప్పగిస్తే బాగుంటుందన్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ఉపాధ్యాయలకు పలు సూచనలుచేశారు. కార్యక్రమంలో డీఈవో మొండయ్య, మార్కెటు కమిటీ చైర్మెన్ మర్రి ఓదెలు, ఉపాధ్యక్షుడు రామిడి తిరుమల్‌రెడ్డి, డైరెక్టర్ బందెల మహేందర్, రామగిరి సంతోష్, మాజీ సర్పంచ్ బొట్ల కిషన్, మండల విద్యాధికారి మధుసూదనాచారి, హెచ్‌ఎం సుదర్శన్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గన్నేరువరం: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా సమస్యలపై పార్టీ మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రైతులకు పూర్తి స్థాయి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు కేటాయించాలని, ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలను నిర్మించాలన్నారు. ప్రభుత్వ ప్రధాన ఆరోగ్య కేంద్రం పనులను వెంటనే ప్రారంభించాలని, మండలానికి కేటాయించిన గురుకుల పాఠశాలను మండలంలోనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం ప్రజాభిప్రాయం మేరకు ఏర్పాటు చేయాలని కోరారు. డబుల్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శులు కూన మల్లయ్య, పిప్పల కనుకయ్య, నాయకులు కాంతాల అంజిరెడ్డి, బోయిని కనుకయ్య, మొలుగూరి ఆంజనేయులు, ముల్కల పవన్, గ్రామశాఖ కార్యదర్శులు తిరుపతి, ఆంజనేయులు, గణేష్, మల్లయ్య, నయీం, రాము, లక్ష్మణ్, కొమురయ్య, గోపయ్య, మల్లయ్య, సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఎంపిక

తిమ్మాపూర్: మండలంలోని ఎల్‌ఎండీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థులు శ్యామ్‌సుందర్, ధన్విన్, ఆర్యనాథన్ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం జరిగే ఎంపిక పోటీలకు ఎంపికైనట్లు పీడీ బన్సీలాల్ తెలిపారు. హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో మంగళవారం నుంచి నిర్వహించే పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంఈవో వి. శ్రీనివాస్, హెచ్‌ఎం పి. శ్రీనివాస్, సీఆర్‌పీలు నరోత్తం, శ్రీనివాస్, నాగరాజు, పావని, రాజ్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.

హక్కులపై అవగాహన ఉండాలి

తిమ్మాపూర్: హక్కులపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ బి. రాకేశ్ కుమార్ అన్నారు. నుస్తులాపూర్‌లో సోమవారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కులు లభిస్తాయని, సమస్య ఎదురైనప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కారం చూసుకోవాలని సూచించారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జలపతి మాట్లాడుతూ.. సమాజంలో కుల వివక్ష, ఆర్థిక అసమానతలు, అంటరానితనం వంటి సమస్యలను నిర్మూలించడమే పౌర హక్కుల దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా కృషి చేయాలని కోరారు. ఏఎస్సై దామోదర్ రావు, ఏఈ సురేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, అంబేడ్కర్ సంఘం నాయకులు చిరంజీవి, చంద్రయ్య, సాయిలు, మాజీ ఎంపీటీసీ కొత్త తిరుపతి రెడ్డి, భూదారపు శ్రీనివాస్, సిరికొండ కొండల్ రావు, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ రొడ్డ రమేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

తిమ్మాపూర్: ఎంపీడీవో కార్యాలయంలో సబార్డినేటర్ సయ్యద్ అజీమొద్దీన్ పదవీ విరమణ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డీపీవో జగదీశ్వర్ పాల్గొని మాట్లాడారు. అటెండర్లు కార్యాలయంలో ఎక్కువ సమయం గడుపుతారని, ఉద్యోగులకు పోస్టులు లేదా పోస్టింగ్‌లు శాశ్వతం కాదని, ఉద్యోగం జీవితంలో ఒక భాగమేనని, ఏదీ మనతో శాశ్వతంగా రాదని, కానీ మంచి జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ నిలిచిపోతాయని తెలిపారు. ఉద్యోగులు తమ కుటుంబంతో గడిపే సమయం కంటే కార్యాలయంలోనే ఎక్కువ సమయం గడుపుతారని, అందుకే సహోద్యోగులతో గడిపిన క్షణాలు విలువైనవని పేర్కొన్నారు. ఎంపీడీవో విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.





అధ్వాన రోడ్లతో అవస్థలు

శంకరపట్నం: మండలంలో అంతర్గత రోడ్లు తేలికపాటి వర్షాలకు చిత్తడిగామ మారుతున్నాయి. నిన్న, మొన్నటి వానలకు కేశవపట్నం–నల్లవెంకయ్యపల్లి రోడ్డు గుంతలమయంగా తయారైంది. గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలుపడుతున్నారు. గుడాటిపల్లి రోడ్డు పరిస్థితి అంతే చేసేదేమి లేక రైతులు, గ్రామస్తులు బురద రోడ్డు పైనుంచే వెళ్తున్నారు. సంబంధిత అధికారులు తాత్కాలిక మరమ్మతులైనా చేయించాలని కోరుతున్నారు.

కూలీల కొరత తప్పినట్టే..



శంకరపట్నం: మండలంలోని రైతులు యంత్రంలో వరినాటు వేయిస్తున్నారు. కూలీల కొరతతో చాలా గ్రామాల్లో యంత్రంతో నాటు వేసేందు కు రైతులు సిద్ధం ఉన్నారు. గుడాటిపల్లె గ్రామంలో యంత్రంతో వరినాటు వేశారు. ఎకరాకు రూ.4,500 చెల్లిస్తూ ముమ్మరంగా నాట్లు వేయిస్తున్నారు.

ప్రతిభా పురస్కారాలు

జమ్మికుంట: పదో తరగతి ఫలితాల్లో మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2024–25 విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సోమవారం విద్యార్థులు మైస దీక్షత, తౌటం అమర్, దొడ్డె అంజనీవర్మకు నగదు, పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పింగిలి వెంకట్‌రెడ్డి, మార్క విజయప్రకాశ్, కాటిపల్లి లింగారెడ్డి, అయిత శ్రీనివాస్, అమృత, సురేష్, హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు సదానందం, శ్రీనివాస్, రాజేందర్, విజయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: పార్టీ ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం ప్రజల నుంచి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి దరఖాస్తులు స్వీకరించారు. ప్రతీరోజు ఇద్దరు కార్పొరేషన్ చైర్మన్‌లు గాంధీభవన్‌లో ఉండి దరఖాస్తులు స్వీకరించాలనే షెడ్యూల్‌లో భాగంగా ఆయన స్వీకరణ చేపట్టారు.

పట్టుదలతో రాణించాలి



శిక్షణను ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌స్పోర్ట్స్: క్రీడా పాఠశాల విద్యార్థులు పట్టుదలతో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ప్రాంతీయ క్రీడా పాఠశాలలో కొత్తగా బాక్సింగ్ శిక్షణను సోమవారం ప్రారంభించి విద్యార్థులకు బాక్సింగ్ కిట్‌ను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు అన్ని రకాల క్రీడల్లో రాణించి మిగతా విద్యార్థులకు స్ఫూర్తిదాయకం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్ గౌడ్, బాక్సింగ్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, సంపత్‌కుమార్, ఉపాధ్యక్షులు కాశీచరణ్, బాక్సింగ్ బాధ్యులు మురళి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



సీఐని సన్మానిస్తున్న నాయకులు

ఇల్లందకుంట: జమ్మికుంట రూరల్ సీఐగా కాంతాల లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన కొరె కిషోర్ బదిలీపై వెళ్లారు. సీఐకి పలువురు నాయకులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతంపలికారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం నిరంతరం పనిచేస్తానని, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

జమ్మికుంట: జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణను కాంగ్రెస్ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా బదిలీపై వెళ్తున్న సీఐ కిషోర్‌కు వీడ్కోలు పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు దేశినికోటి, సుంకరి రమేష్, జిల్లేల తిరుపతిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, డాన్ రమేష్, మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అమర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం బహిష్కరణ



సమావేశంలో అధికారులు, దళితసంఘం నాయకులు

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్‌లో సోమవారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవాన్ని దళిత సంఘం నాయకులు బహిష్కరించారు. పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామంలోని దళితులకు పంచాయతీ కార్యదర్శి సమాచారం అందించలేదని, దళితకాలనీలో నిర్వహించకుండా గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసి కులవివక్షత చూపించారని అంబేడ్కర్ సంఘం నాయకుడు కనకం శంకర్ ఆరోపించారు. దీంతో సమావేశానికి వచ్చిన డిప్యూటీ తహసీల్దార్ పార్థసారథి, సూపరింటెండెంట్ రాఘవేందర్‌రెడ్డి వెళ్లిపోయారు.

ప్రైవేటు బస్సులను అడ్డుకున్న గ్రామస్తులు





బస్సులను అడ్డుకున్న గ్రామస్తులు, నేలపై కూర్చొని మాట్లాడుతున్న హెచ్‌ఎం

- పాఠశాలను కాపాడుకునేందుకు గ్రామస్తుల సాహసం
- ఏడు తరగతులకు 15 మందితో కాలం వెల్లదీస్తున్న ఉపాధ్యాయులు

చిగురుమామిడి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో సోమవారం రెండు ప్రైవేటు పాఠశాలల బస్సులను గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉన్నారని, ఇలాగైతే మూసివేసే ప్రమాదం ఉందని, ఇక్కడి పిల్లలు ఇక్కడే చదవాలని పేర్కొన్నారు. గ్రామంలోని పాఠశాలలో ఏడు తరగతులు ఉన్నాయి. ఇందులో కేవలం 15 మంది మాత్రమే చదువుకుంటున్నారు. ఇక్కడ 8 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మరోవైపు గ్రామం నుంచి ప్రైవేటు పాఠశాలలకు సుమారు 20 మంది వెళ్తున్నారు. దీంతో గ్రామస్తులు తమ గ్రామం పిల్లలు ఇక్కడే చదవాలని నిర్ణయించి.. ప్రైవేటు బస్సులను అడ్డుకున్నారు. ఆ పిల్లలంతా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వస్తే పిల్లల సంఖ్య 36మందికి చేరుతుందని ప్రధానోపాధ్యాయుడు అలీ తెలిపారు.

ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఘటన

జమ్మికుంట: పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలుర పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు హర్షవర్ధన్, మణిచరణ్ సోమవారం వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారని హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్‌చారి తెలిపారు. తోటి విద్యార్థులు అందించిన సమాచారంతో తనతో పాటు హౌస్ మాస్టర్ రవీందర్ కలిసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించామన్నారు. తల్లిదండ్రులకు సమాచారం అందించగా.. హర్షవర్ధన్ తల్లితండ్రులు హుజూరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, మణిచరణ్‌ను జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించాక తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారన్నారు. కలిషిత ఆహారం తినడంతోనే విద్యార్థులు అస్వస్థతు గురైనట్లు తెలుస్తోంది. ఈ విషయంపై పాఠశాల నిర్వాహకులను సంప్రదించగా.. ఆదివారం తల్లితండ్రులు తీసుకొచ్చిన ఆహారం తినడమే కారణమై ఉంటుందని, మిగతా విద్యార్థులు బాగానే ఉన్నారన్నారు. ఎంఈవో హేమలత పాఠశాలకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వావిలాల పీహెచ్‌సీ సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. దగ్గు, జలుబు తదితర ఆరోగ్య సమస్యలు ఉన్న 23మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ మహోన్నత పటేల్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రామ్‌సింగ్, హెల్త్ సుపర్‌వైజర్ శ్రీధర్‌చారి, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్‌ఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

గన్నేరువరం: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాదిన్నర పాలనలో అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. సోమవారం మండలంలోని గుండ్లపల్లిలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులకు మొండిచెయి చూపుతున్నారని విమర్శించారు. ప్రజాపాలనలో మండలంలో 2561 మందిని గుర్తించి కేవలం 161 మందికే ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుడా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. డబుల్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిన చేయకుంటే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున నిరసనకు దిగుతామని హెచ్చరించారు. మండలానికి కాళేశ్వరం జలాలను తీసుకొచ్చిన ఘనత బీఆర్ఎస్‌దేనని, మెట్ట ప్రాంతం గన్నేరువరం మండలం నేడు పంటలతో కళకళలాడుతుందని, రైతన్నలు ఆనందంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, మహిళ అధ్యక్షురాలు కుసుంభ నవీన, నాయకులు గూడెల్లి ఆంజనేయులు, బద్దం తిరుపతిరెడ్డి, పుల్లెల లక్ష్మణ్, న్యాత సుధాకర్, రవి, ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హుజూరాబాద్: మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యపై అర్థం లేని ఆరోపణలు చేయడం సరికాదని ఎమ్మార్పీఎస్ నాయకులు మారెపల్లి శ్రీనివాస్, కలవల మల్లయ్య, కుమార్, కే.సంపత్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అభివృద్ధికి పాటుపడుతున్నారని, వందశాతం ఆస్తి పన్ను వసూళ్లే ఇందుకు నిదర్శనమన్నారు. వేసవిలో పిల్లలు సెలవులను వృథా చేసుకోవద్దని క్రీడా శిబిరం నిర్వహించారని, వర్షాకాలంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతూ ప్రజలు రోగాల బారిన పడకుండా చేస్తున్నారని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల గ్రామంలో సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నేదురు సమ్మయ్యకు తీవ్రగాయాలయ్యాయని గ్రామస్తులు తెలిపారు. మేస్త్రీ పనిచేసే సమ్మయ్య బైక్‌పై వెళ్తుండగా బస్సు ఢీకొట్టింది. స్థానికులు 108లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. కేశవపట్నంలో లారీ లేగదూడను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది.

మత్స్యకారుడి మృతదేహం లభ్యం



గువ్వ రవి మృతదేహం

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మత్స్యకారుడు గువ్వ రవి(43) మృతదేహం ఎల్‌ఎండీలో లభ్యమైనట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. లోయర్ మానేరు డ్యామ్‌లో ఆదివారం చేపలు పట్టడానికి వెళ్లి గల్లంతయ్యాడు. తోటి మత్స్యకారులు గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. సోమవారం రెండు గంటలపాటు గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడని భార్య మంజుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని, మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారని ఎస్సై వివరించారు.